సాక్షి చిత్తూరు

ఆదివారం । 7 । జూలై । 2024



డిక్రీల అమలుపై అవగాహన

కోర్టుల్లో డిక్రీల అమలు, నిబంధనలపై జిల్లాలోని న్యాయమూర్తులకు రిటైర్డ్ జడ్జిలు శనివారం అవగాహన కల్పించారు. - 8లో



సంక్రమిత వ్యాధుల కట్టడి

జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల కట్టడికి టీకాలు వేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. - 8లో



మామిడి మొక్కల నరికివేత

మూడేళ్ల క్రితం నాటిన మామిడి మొక్కలను కక్షసాధింపుతో నరికివేసిన సంఘటన శనివారం వెలుగుచూసింది. - 8లో

న్యూస్‌రీల్

స్వయంభు దేవస్థానంలో టీటీడీ మాజీ ఈవో



మాజీ టీటీడీ ఈవోకు చిత్ర పటం అందజేస్తున్న ఆలయ అధికారులు

కాణిపాకం: కాణిపాకంలోని స్వయంభు వరసిద్ధి వినాయకస్వామిని శనివారం మాజీ టీటీడీ ఈవో కృష్ణయ్య దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు దర్శనం కల్పించడంతో పాటు వేదపండితుల ఆశీర్వచనాలు అందజేశారు. స్వామి ప్రసాదం, చిత్రపటం అందించారు. కార్యక్రమంలో వెంకటేశు, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో కమిషనర్



కమిషనర్లకు చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

కాణిపాకం: కాణిపాకంలోని స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామిని శనివారం రాష్ట్ర ఐఆర్ఎస్ ఆదాయపు పన్ను ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మధుస్మిత, తిరుపతి ఆదాయపు పన్ను కమిషనర్ దుర్గేష్ దర్శించుకున్నారు. వీరికి ఈవో వెంకటేశు ఘనస్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేదపండితుల ఆశీర్వచనాలు, స్వామి చిత్రపటం అందజేశారు. ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి పాల్ ల్యాబ్ అమలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని సర్కారు బడుల్లో పాల్ (పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్) ల్యాబ్‌లను సోమవారం నుంచి పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఈ ల్యాబ్‌ల నిర్వహణకు సంబంధించి ప్రత్యేక విధి విధానాల ఉత్తర్వులను జారీచేశారు. ఆ ఉత్తర్వులు శనివారం డీఈఓ కార్యాలయానికి అందాయి. పాల్ ల్యాబ్‌లలో బోధించే గణితం, తెలుగు, ఇంగ్లీషు సబ్జెక్టుల కంటెంట్, లింక్‌లను జారీచేయనున్నట్లు అందులో తెలిపారు. ఇందుకు ప్రత్యేక టైంటేబుల్‌ను రూపొందించుకోవాలని సూచించారు. పాల్ ల్యాబ్ అమల్లో ఉన్న 64 పాఠశాలల్లో ఈ నెల 8వ తేదీ నుంచి ల్యాబ్‌లను ప్రారంభించాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలకు ఇచ్చిన ట్యాబ్‌లు, ఇయర్‌ఫోన్‌లు, చార్జర్‌ల అక్విటెన్స్‌లు తప్పనిసరిగా హెచ్‌ఎంల వద్ద ఉండాలని స్పష్టం చేశారు. పాల్ ల్యాబ్‌లను విద్యాశాఖ అధికారులు క్రమం తప్పకుండా సందర్శించాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ, సమగ్రశిక్ష ఏపీసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు.

కేజీబీవీ ఏఎన్‌ఎంలకు శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ (కేజీబీవీ) పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలకు శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ఎస్‌పీడీ శ్రీనివాసరావ్ ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వులు శనివారం జిల్లా సమగ్రశిక్ష కార్యాలయానికి చేరాయి. ఆరోగ్యం, మానసిక క్షేమం, కౌన్సెలింగ్, కౌమార సంబంధిత సమస్యలపై శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలకు మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు సూచించారు. జిల్లాలో పనిచేస్తున్న సిబ్బందికి ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనునారు. ఈ శిక్షణకు కేజీబీవీ ఏజీసీడీఓ ఉషారాణి ప్రోగ్రాం ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు. ఈ శిక్షణకు ఒక్కో బ్యాచ్‌కు 50 మంది ఏఎన్‌ఎంలు హాజరు కానున్నారు. మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(ఎయిమ్స్)లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ శిక్షణకు ఏఎన్‌ఎంలు తప్పనిసరిగా హాజరుకావాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బాల్య వివాహాల కట్టడికి వీడియోలు

చిత్తూరు కలెక్టరేట్ : బాల్యవివాహాల కట్టడికి సంబంధించి రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక వీడియోలను రూపొందించారు. సంబంధిత వీడియోల వివరాలను సూచిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారులకు శనివారం ఉత్తర్వులు పంపారు. ఉత్తర్వుల్లో బాల్యవివాహాల కట్టడికి రూపొందించిన ప్రత్యేక వీడియోల లింక్‌లను పేర్కొన్నారు. ఆ వీడియోలను జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు తప్పనిసరిగా చూపించి అవగాహన కల్పించాలన్నారు. డీఈఓ, డీవైఈఓ, ఎంఈఓలు పకడ్బందీగా పర్యవేక్షించాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

అవినీతి కేంద్రాలుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే దందా
- ఉన్నత స్థాయి అధికారులకు వాటాలు
- రిజిస్ట్రేషన్ ప్రక్రియలో మార్పులపై నోరుమెదపని కూటమి ప్రభుత్వం
- అవినీతి నిర్మూలనకు గత ప్రభుత్వ హయాంలో సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు

జూలు విదిల్చిన అవినీతి!



రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఇటీవల రమేష్ అనే వ్యక్తి (పేరు మార్చాం) తన వ్యవసాయ భూమిని విక్రయించడానికి వెళ్లాడు. భూమికి సంబంధించిన ఒక సర్వే నంబరులో వచ్చే స్థలాన్ని వ్యవసాయ భూమిగా విక్రయించడానికి వీల్లేదని, ఇంటి జాగా కింద రిజిస్టరు చేయాలని తిప్పి పంపేశారు. అలా చేస్తే రిజిస్ట్రేషన్ ఫీజు ఎక్కువ అవుతుండడంతో డాక్యుమెంట్ రైటర్ ద్వారా రమేష్ సబ్‌రిజిస్ట్రార్‌ను సంప్రదించారు. రిజిస్ట్రార్‌తో సంప్రదింపులు జరిపిన రైటర్ రూ.30 వేలు బేరం కుదుర్చుకుని చడీ చప్పుడు లేకుండా రిజిస్ట్రేషన్ చేసేశారు.

గూడూరులోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో చోటుచేసుకుంటున్న అవినీతిపై గతంలో ఏసీబీ అధికారులకు అనేక ఫిర్యాదులు వెళ్లాయి. అప్పట్లో ఏసీబీ దాడులు నిర్వహించి అవినీతికి పాల్పడ్డ వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. అయినా అక్కడ మార్పు రావడం లేదు. ఏ రిజిస్ట్రేషన్ జరగాలన్నా ఒక డాక్యుమెంట్ రైటర్ ఆమోద ముద్ర వేస్తేనే సబ్‌రిజిస్ట్రార్ సంతకం చేసే పరిస్థితి కనబడుతోంది. ఇక్కడ కోదండం అనే వ్యక్తి వ్యవసాయ భూమి అమ్మడానికి వెళ్లగా ఆధార్ కార్డులోని పేరుకు, 1–బీ పట్టాలోని పేరుకు ఒక అక్షరం తేడా వచ్చింది. దీంతో రిజిస్ట్రార్ తిప్పిపంపేశాడు. ఆపై డాక్యుమెంట్ రైటర్ తనదైన శైలిలో మంతనాలు జరిపారు. మొత్తంగా రూ.10 వేలు లంచం ఇవ్వడంతో రిజిస్ట్రేషన్ సజావుగా జరిగిపోయింది.

.. ఇది ఒక గూడూరు, రేణిగుంటలోనే కాదండోయ్.. ఉమ్మడి జిల్లాలో ఏ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లినా ఇదే పరిస్థితి. ఒక్కో తప్పుకు ఒక్కో రేటు విధిస్తున్నారు. డాక్యుమెంట్ రైటర్లను అడ్డం పెట్టుకుని అడ్డదిడ్డంగా వసూలు చేస్తున్నారు. ఈ అవినీతి సామ్రాజ్యానికి ముకుతాడు వేసేందుకు గత ప్రభుత్వం సచివాలయంలోనే భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టగా.. ఇప్పడొచ్చిన కూటమి ప్రభుత్వం దీనిపై నోరు మెదపడం లేదు. ఇదే అదునుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది తమ అవినీతి జూలు విదిల్చి విచ్చలవిడిగా దండుకుంటుండడం విమర్శలకు తావిస్తోంది.

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఉమ్మడి జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు అవినీతికి పరాకాష్టగా మారుతున్నాయి. ఇక్కడి సిబ్బంది చేతులు తడపందే రిజిస్ట్రేషన్లు కావడం లేదు. దీంతో క్రయవిక్రయదారులు సిబ్బంది అడిగినంత సమర్పించుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. చిత్తూరు జిల్లాలో 8 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, తిరుపతి జిల్లాలో 16 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కొంతమంది అవినీతి సబ్‌రిజిస్ట్రార్లు, డాక్యుమెంట్ రైటర్లు, కాంట్రాక్టు సిబ్బంది భాగస్వాములై తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు కార్యాలయాలకు వచ్చే వారిని దోచేస్తున్నారు. దీంతో ఆస్తుల రిజిస్ట్రేషన్ అంటేనే జనం జడుసుకుంటున్నారు.

ఒక్కో పొరపాటుకు ఒక్కో రేటు

ప్రతి రిజిస్ట్రేషన్‌కు, రికార్డుల్లో కనిపించే ప్రతి పొరపాటుకు రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది ఓ రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నారు. ఆస్తుల విక్రయాలకు వచ్చేవారి పేరు పట్టా పాసుపుస్తకానికి, ఆధార్ కార్డుకు కచ్చితంగా సరిపోవాల్సిందే. లేకుంటే అక్షరం మారినా కప్పం కట్టాల్సిందే. 1–బీలో ఇంటిపేరు పూర్తిగా రాసి, ఆధార్‌లో ఇన్షియల్ వేసి ఉన్నా, ఆధార్‌లో పేరు పక్కన కులం పేరు ఉండి 1–బీలో లేకున్నా, తండ్రి పేరుకు ఇన్షియల్ లేకున్నా వారు బలైపోయినట్టే. ఇలాంటి వారికి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది ఒక్కో రేటు విధించి వసూలు చేస్తున్నారు. కార్యాలయాల్లో వసూళ్లంతా డాక్యుమెంట్ రైటర్లు, కాంట్రాక్టు సిబ్బంది కనుసన్నల్లోనే సాగిపోతోంది. ఇక్కడ చోటు చేసుకునే అవినీతిపై ఎవరైనా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకునే వారు లేకపోగా ఆ ఫిర్యాదులను ఆధారం చేసుకుని నెలవారీగా అందించే సొమ్ముకు అదనంగా వసూళ్లు చేసుకోవడం ఉన్నతాధికారుల వంతైపోయిందన్న విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో లంచం ఇవ్వందే ఏ పనీ జరగడంలేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

ఇబ్బంది పెడుతున్న ఎల్‌పీఎం జాప్యం

రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు వచ్చేవారిని ఒకవైపు రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది వేధిస్తుంటే మరోవైపు ఎల్‌పీఎం జాప్యం ఇబ్బంది పెడుతోంది. రీ సర్వే ప్రక్రియ జిల్లాలోని పలు గ్రామాల్లో పూర్తికాకపోవడం, కొన్ని గ్రామాల్లో అరకొర పూర్తి కావడంతో వాటికి ల్యాండ్ పార్సిల్ నంబర్ (ఎల్‌పీఎం)లు అందించలేదు. దీంతో ఆ గ్రామాలకు సంబంధిత రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అంతరాయం ఏర్పడుతోంది. సమగ్ర భూసర్వే పూర్తయిన గ్రామాల్లో భూముల వివరాలను రెవెన్యూశాఖ వెబ్‌ల్యాండ్‌లో అప్‌లోడ్ చేసింది. వాటిని రిజిస్ట్రేషన్ శాఖ మ్యాపింగ్ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తయితేనే రిజిస్ట్రేషన్‌కు వీలుంటుంది. అయితే ఈ ప్రక్రియ కొన్నిచోట్ల ఇప్పటికీ పూర్తికాకపోవడంతో ఆ గ్రామాల్లో ఎల్‌పీఎం నంబర్ అప్రూవల్‌గాక వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ నిలిచిపోయింది. కొత్త ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ఇంకా ఎలాంటి నిర్ణయాన్ని ప్రకటించకపోవడం రైతులకు శాపంగా మారుతోంది. సాఫ్ట్‌వేర్‌లో మార్పులు, చేర్పులు ఉంటాయా? లేక గత ప్రభుత్వ విధానాన్నే కొనసాగిస్తుందా? అన్నది తేలాల్సి ఉంది. కాగా సమగ్ర భూ సర్వే పట్ల చాలా చోట్ల అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో భూసర్వే పూర్తయి ఎల్‌పీఎం నంబర్ అప్రూవల్ కాకుండా పెండింగ్‌లో ఉన్న గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు విడుదల కావాల్సి ఉంది.

రేపటి నుంచి అందుబాటులో ఇసుక



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో గుర్తించిన ఇసుక డిపోలలో ఈ నెల 8వ తేదీ నుంచి ఇసుక అందుబాటులో ఉంటుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ వెల్లడించారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ప్రజలకు అందుబాటులో ఉండేలా ఇసుక డిపోలు ఏర్పాటు చేశామన్నారు. చిత్తూరు రూరల్ మండలం బీఎన్ ఆర్‌పేట సమీపంలోని పాలూరు, అరతల సమీపంలోని దిగువమాసాపల్లి, గంగవరం మండలం గండ్రాజుపల్లి సమీపంలోని బైరెడ్డిపల్లిక్రాస్‌రోడ్డు వద్ద ఇసుక డిపోలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాలూరు, అరతల డిపోలలో టన్ను ఇసుక రూ.155కు విక్రయించనున్నట్లు చెప్పారు. బైరెడ్డిపల్లి క్రాస్‌రోడ్డు డిపోలో టన్ను ఇసుక రూ.200గా నిర్ణయించినట్లు వివరించారు. వినియోగదారులు యూపీఐ విధానంలో నగదు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. కొనుగోలుదారులు ఆధార్‌కార్డు, మొబైల్ నెంబర్, వాహనం నెంబర్, డెలివరీ అడ్రస్‌ను ఇవ్వాలని చెప్పారు. వినియోగదారులు చెల్లించిన మొత్తానికి రశీదు ఇవ్వనున్నట్లు వివరించారు. రోజుకు మూడు డిపోల నుంచి 1000 టన్నుల ఇసుక సరఫరా చేస్తామని తెలిపారు. ఈ ఇసుక డిపోల్లో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇసుక పంపిణీ కొనసాగుతుందన్నారు. ఇసుక డిపోలలో మొదట వచ్చిన వారికి మాత్రమే ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. నగదు చెల్లింపులు అనుమతించేది లేదని స్పష్టం చేశారు.

కాణిపాకం కళకళ!

జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం వరసిద్ధి వినాయక దేవస్థానం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. ఆలయాభివృద్ధి అధికారులు ఇతోధికంగా కృషి చేస్తుండడంతో వివిధ అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. రూ.152 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. జీర్ణోద్ధరణతో ఆలయం సరికొత్త కళను సంతరించుకుంది. మౌలిక వసతుల కల్పన, భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం కల్పిస్తుండడంతో భక్తుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది.

- అభివృద్ధి పథంలో శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం
- మూడేళ్లల్లో శరవేగంగా పనులు
- రూ.152కోట్లతో ప్రగతి పరుగు
- వసతులకు అత్యధిక ప్రాధాన్యత
- ఆలయానికి సరికొత్త శోభ
- స్వయంభు దర్శనానికి భక్తుల తాకిడి



నూతనంగా నిర్మించిన ఆలయం



ముఖద్వారానికి బంగారు పూత

కాణిపాకం: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం అభివృద్ధికి గత ప్రభుత్వ హయాంలో బలమైన బీజాలు పడ్డాయి. అభివృద్ధి చేయాలని అధికారులు, పాలక మండలి కార్యవర్గం సత్య ప్రమాణంతో ముందుకు వెళ్లింది. మూడేళ్లుగా ఆలయాభివృద్ధే ధ్యేయంగా అడుగులు వేసింది. దేవస్థాన, దేవదాయ అధికారులు, సిబ్బందితోపాటు దాతల సహాయ సహకారాలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. తొలుత ఆలయ జీర్ణోద్ధరణ పనులను ప్రారంభించి, పూర్తి చేయడంతో ఆలయం కొత్త శోభను సంతరించుకుంటోంది. మరిన్ని పనులను సైతం ప్రారంభించింది.

ఇవీ జరుగుతున్న పనులు

అధికారులు, పాలక మండలి ప్రణాళికల ప్రకారం మరిన్ని అభివృద్ధి పనులకు రూ.18.67కోట్లు వెచ్చిస్తున్నారు. వీటిలో కొన్ని పనులు చివరి దశకు చేరుకుంటున్నాయి. నిర్ణీత సమయంలోపు పనులను పూర్తి చేసే దిశగా పర్యవేక్షిస్తున్నారు. దేవస్థానానికి చెందిన వినాయక సదన్‌పై రెండు అంతస్తుల నిర్మాణానికి రూ.12.12 కోట్లు వ్యయం చేస్తున్నారు. అన్నదాన భవన మార్పునకు రూ.3.40కోట్లు, పైపల్లె వద్ద ఆర్చ్ గేటు నిర్మాణానికి రూ.1.10కోట్లు లక్షలు, 100 అడుగుల సీసీ రోడ్డు ప్రవేశ ద్వారం నిర్మాణానికి రూ.1.10 కోట్లు, వంద అడుగుల రోడ్డు నిర్మాణం వైపు ప్రహరీ గోడకు రూ.25 లక్షలు, పాటూరు వద్ద ఆర్చి గేట్ నిర్మాణానికి రూ.17.30 లక్షలు, కాణిపాక దేవస్థాన భూమికి రక్షణగా ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.40 లక్షలు, పెయింటింగ్, ఇతరత్రా పనులకు గాను రూ.40 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. స్వామి వారి మహారథానికి రూ.13.50 లక్షలతో పనులు సాగుతున్నాయి.

అభివృద్ధి పనులకు దాతల సహకారం

దేవస్థానంలో అభివృద్ధి పనులు, నూతన నిర్మాణాలకు దాతలు ముందుకు వచ్చారు. వారి విరాళాలతో అద్దాల మండపం నిర్మాణానికి రూ.కోటి, ఆలయ ఆవరణలో వీఐపీ గెస్ట్ హౌస్ నిర్మాణానికి రూ.3.30 కోట్లు, ఈఓ క్వార్టర్స్ సమీపంలో వీఐపీ గెస్ట్ హౌస్ రూ.3 కోట్లు, రాతితో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి రూ.1.10 కోట్లు, స్వామివారి ధ్వజస్తంభం, గర్భాలయానికి బంగారు పూతకు రూ.6 కోట్లు కాగా, మొత్తం రూ.14.40 కోట్లు దాతల సాయంతో పనులు పూర్తి చేశారు. దీంతో ఆలయం కొత్త రూపం సంతరించుకుంటోంది. భక్తులకు తాకిడి పెరిగింది. గతంలో 10వేలలోపు భక్తులు వస్తుంటే.. ఇప్పుడు 20వేలు దాటుతోంది. ఇందుకు తగ్గట్లు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వసతులు కల్పిస్తున్నారు.

అభివృద్ధి పనులకు రూ.52కోట్లతో ప్రతిపాదనలు

మాస్టర్ ప్లాన్‌లో భాగంగా రూ.52కోట్లతో పనులు చేయాల్సి ఉందని దేవస్థాన అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. షాపింగ్ కాంప్లెక్స్‌కు రూ.2కోట్లు, 40 అడుగుల సీసీరోడ్డుకు రూ.కోటి, పార్కింగ్ స్థలానికి రూ.4కోట్లు, కల్యాణ మండప నిర్మాణానికి రూ.4 కోట్లు, కొత్త కోనేరు నిర్మాణానికి రూ.3కోట్లు, వ్యక్తిగత కాటేజీల కోసం రూ.14 కోట్లు, అర్చకుల క్వార్టర్స్ నిర్మాణానికి రూ.15 కోట్లు వ్యయంగా అంచనాలు రూపొందించి అధికారుల ముందుపెట్టారు.

రూ.27.33 కోట్లతో పనులు పూర్తి

గత మూడేళ్ల కాలంలో రూ.27.33 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ఇందులో ఆల య పునర్‌నిర్మాణ పనులకు రూ.9.6 కోట్లు వ్యయం చేశారు. ప్రధాన ఆలయానికి కట్ స్టోన్ ఫ్లోరింగ్‌కు రూ.77 లక్షలు, సౌండ్, లైటింగ్ సర్వీసులకు రూ.298.03 లక్షలు, 100 అడుగుల వెడల్పు ఉన్న రోడ్డును అనుసంధానానికి 310 మీటర్ల సీసీరోడ్డుకు రూ.2.95 కోట్లు, లడ్డూపోటు భవన నిర్మాణం, పడితారం స్టోర్ భవనానికి రూ.4.86 కోట్లు, 100 మీటర్ల బీటీ రోడ్డుకు రూ. 1.10 కోట్లు, పడితారం, సివిల్ స్టోర్ షెడ్ కూల్చివేత, పునఃనిర్మాణ పనులకు రూ.31.50లక్షలు, చెత్త సంపద కేంద్రం, షెడ్ నిర్మాణానికి రూ.17.50 లక్షలు, వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్, స్మార్ట్ ఎక్స్‌ప్రెస్ కోసం రూ.18.30లక్షలతో పనులు పూర్తి చేశారు. ఈఓ కార్యాలయ అభివృద్ధి, మరమ్మతు పనులు, ఫ్లెక్సీ బోర్డు వంటి పనులకు లక్షలాది రూపాయలు ఖర్చుచేశారు.

రూ.44 కోట్లతో మరింత అభివృద్ధి

దేవస్థానం త్వరలో రూ.44.24 కోట్లతో మరిన్ని పనులు చేసేందుకు సిద్ధమవుతోంది. అందులో బహుదానది ఒడ్డున స్నానపు గదుల నిర్మాణానికి రూ.1.10 కోట్లు ఖర్చు పెట్టనున్నారు. రూ.24 కోట్లతో క్యూ కాంప్లెక్స్, ఎక్స్‌రే బ్యాగేజీ స్కానర్ సరఫరాకు రూ.42 లక్షలు, ఎల్‌ఈడీ బోర్డులకు రూ.35 లక్షలు, సామూహిక కల్యాణ మండపం వద్ద అభివృద్ధి పనులకు రూ.12 లక్షలు, బస్టాండుకు రూ.14.37 కోట్లు, పట్నంకొండ వద్ద ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.3 కోట్లు, దేవస్థాన భూమి ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.40 లక్షలతో టెండర్లు ఆహ్వానించారు.



పూర్తి కావస్తున్న ఆర్చి నిర్మాణం



మరో ముఖద్వారానికి వెండిపూత

వరసిద్ధుని అనుగ్రహంతోనే అభివృద్ధి



వరసిద్ధుని అనుగ్రహంతోనే కాణిపాక క్షేత్రంలో అభివృద్ధి పనులు, జీర్ణోద్ధరణతో ఆలయానికి సరికొత్త రూపం సంతరించుకుని భక్తులను ఆకర్షిస్తోంది. భక్తులకు అన్ని వసతులు ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ఈ మూడేళ్ల కాలంలో సుమారు రూ. 100కోట్లతో అభివృద్ధి పనులు కొన్ని పూర్తి చేశాం. మరికొన్ని పూర్తి కావాల్సి ఉంది. మరో రూ.50 కోట్ల మేర పనులు చేయనున్నాం. ప్రస్తుతం పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా పనులు చేపడుతున్నాం. ఉన్నతాధికారులు, భక్తులు, దాతల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తాం.

– వెంకటేశు, ఈఓ, కాణిపాకం

క్లుప్తంగా

నిధుల స్వాహా కేసులో ఇద్దరు సస్పెన్షన్



అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

పుంగనూరు: మండల కార్యాలయంలో రూ.1.36 కోట్ల నిధులు స్వాహా కేసులో ఏవో రాజేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ జెడ్పీ సీఈవో గ్లోరియా ఆదేశాలు జారీ చేశారు. ఆమె శనివారం పుంగనూరు మండల కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. నిధులు స్వాహా చేసిన కంప్యూటర్ ఆపరేటర్ సునీల్ లావాదేవీలను పరిశీలించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె విలేకరులకు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి, నిందితున్ని అదుపులోకి తీసుకుంటే వాస్తవాలు వెలుగుచూడనున్నాయి.

ప్రమాదంపై మంత్రి దిగ్భ్రాంతి

పెద్దపంజాణి: మండలంలోని బసవరాజు కండ్రిగ సమీపంలో శనివారం ఉదయం జరిగిన బస్సు ప్రమాదంపై రవాణాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన చిత్తూరు డీటీసీ నిరంజన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి బాధితులకు తగిన సాయం అందించాలని ఆదేశించినట్లు డీటీసీ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఆ ప్రాంతంలో తగిన రోడ్డు భద్రతా సూచికలు ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. సంఘటన స్థలాన్ని పుంగనూరు ఎంవీఐ సుప్రియ పరిశీలించారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి



మృతి చెందిన ఆంజనేయులు

రొంపిచెర్ల: బైక్ డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి చెందిన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ మధు కథనం మేరకు, అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలం గట్టుపల్లెకు చెందిన ఆంజనేయులు(26), అనిల్‌కుమార్(26) తిరుపతిలోని వస్త్ర దుకాణంలో పని చేస్తున్నారు. వీరిద్దరూ స్వగ్రామం గట్టుపల్లెకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. తిరుపతి–మదనపల్లె రహదారిపై పెద్దగొట్టిగల్లు సమీపంలో బోనంవారిపల్లె వద్ద డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అనిల్‌కుమార్‌ను చికిత్స కోసం పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

డ్వాక్రా సంఘాల సొమ్ము స్వాహా!

- రూ.14.18 లక్షలకు కుచ్చుటోపీ పెట్టిన ఆర్పీ
- పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళలు



పోలీస్‌స్టేషన్ వద్ద ఫిర్యాదు కాపీతో డ్వాక్రా మహిళలు

పుత్తూరు: గత కొన్నేళ్లుగా మహిళా సంఘ సభ్యుల సొమ్మును స్వాహా చేస్తున్న రిసోర్స్ పర్సన్ (ఆర్పీ) బండారం వెలుగులోకి వచ్చింది. మెప్మా అధికారుల నిర్లక్ష్యం కారణంగా మహిళా సంఘ సభ్యులు నిలువునా మునిగిపోయారు. మహిళా సంఘ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా...

పట్టణ పరిధిలోని ఆరేటమ్మ కాలనీ ఆర్పీ భాగ్యలక్ష్మి 13 గ్రూపులకు చెందిన రూ.14.18 లక్షలను స్వాహా చేసింది. సంఘ సభ్యులు పొదుపు సొమ్ముతో పాటు బ్యాంకుల్లో తీసుకొన్న రుణాలను సైతం తానే వడ్డీతో సహా చెల్లిస్తానని నమ్మబలికి సొంత అవసరాలకు సభ్యుల నుంచి తీసుకొంది. విఘ్నేష్ సంఘం పేరిట రూ.3 లక్షలు, శ్రావణి సంఘం పేరిట రూ.2 లక్షలు, లక్ష్మీదేవి సంఘం పేరిట 1.5 లక్షలను బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొంది. ఇతర సంఘాలకు చెందిన రూ.7.68 లక్షల పొదుపు సొమ్మును సైతం తీసుకొంది. ఈ తతంగం మొత్తం 2016–18 మధ్య కాలంలో జరిగింది. ఈ క్రమంలో 2020లో ఆరేటమ్మ కాలనీకి చెందిన నెహ్రూ సంఘానికి మంజూరైన రూ.3 లక్షల శ్రీనిధి సొమ్మును సైతం ఆర్పీనే వాడేసుకోవడంతో ఆ సంఘ సభ్యులు విషయాన్ని మున్సిపాలిటీలోని మెప్మా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్పీ భాగ్యలక్ష్మి నిర్వాకాన్ని ఒక్కో గ్రూపు సభ్యులు బయటపెట్టారు. దీంతో ఆర్పీ పరిధిలోని 28 సంఘాల ఖాతాలను ఆడిట్ చేశారు. మొత్తం 13 సంఘాలకు చెందిన రూ.14.18 లక్షల నగదు స్వాహా చేసినట్లు ఆడిట్ అధికారులు లెక్క తేల్చారు.

మెప్మా అధికారుల నిర్లక్ష్యమే కారణం

సంఘ సభ్యుల సొమ్ము స్వాహా చేసిందని తెలిసినా నాలుగేళ్ల పాటు మెప్మా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే తాము దారుణంగా నష్టపోయామని మహిళలు చెబుతున్నారు. 2020లో విషయం బయటకు పొక్కినా 2020 నవంబర్‌లో గానీ ఆర్పీ లాగిన్‌ను లాక్ చేయలేదు. దీన్ని బట్టే మెప్మా అధికారుల తీరు తేటతెల్లమవుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంఘ సమావేశాల్లో ఆర్పీ భాగ్యలక్ష్మి తీసుకొన్న సొమ్ము అసలు, వడ్డీతో కలిపి అజెండాలో రాసి తీర్మానం చేయగా, అందులో భాగ్యలక్ష్మీ సైతం సంతకం చేయడం గమనార్హం. అన్ని విషయాలపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఉన్నతాధికారులు తమకు న్యాయం చేయకపోతే రోడ్డుపై ఆందోళనలు తప్పదని మహిళలు తేల్చి చెబుతున్నారు.

పెద్దిరెడ్డి లక్ష్మ రెడ్డికి నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు

సదుం: మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తండ్రి లక్ష్మరెడ్డి 12వ వర్ధంతిని శనివారం మండలంలోని ఎర్రాతివారిపల్లెలో నిర్వహించారు. ఆయన సమాధి వద్ద ప్రత్యేక పూజలు చేసి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి, స్వర్ణలతమ్మ దంపతులు నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి దంపతులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ, పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి, అభినయ్ రెడ్డి, రేణుకమ్మ, వేణుగోపాల్ రెడ్డి, నిహాంత్‌రెడ్డి నివాళులర్పించారు. పలువురు అభిమానులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటి వద్ద అన్నదానం చేశారు.

సమస్యలు పరిష్కరిస్తాం

పలువురు తమ సమస్యలపై ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డిని కలిశారు. సమస్యలను ఆలకించిన వారు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎమ్మార్సీ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, కొండవీటి నాగభూషణం, పుంగనూరు, పులిచెర్ల ఎంపీపీలు భాస్కర్ రెడ్డి, సురేంద్రనాథ రెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, నాయకులు ఫక్రుద్దీన్, కృష్ణారెడ్డి, రెడ్డెప్పరెడ్డి, ప్రకాష్ రెడ్డి, తిమ్మారెడ్డి, భాస్కర్ రెడ్డి, రామాంజులు, మోహన్ రెడ్డి, గౌరీరెడ్డి, హరినాథరెడ్డి, గణేష్‌రెడ్డి, నారాయణ రెడ్డి, సయ్యద్‌బాషా, ఖాజాపీర్, ఇందాద్, వినోద్, శివారెడ్డి, మనోహర్ రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, ధనశేఖర్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కోర్టుల్లో డిక్రీల అమలుపై అవగాహన

చిత్తూరు అర్బన్: న్యాయస్థానాల్లో డిక్రీల అమలులో ఉన్న సందేహాలు, నగదు డిక్రీల అమలుపై జిల్లాలోని న్యాయమూర్తులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు ఆధ్వర్యంలో చిత్తూరులోని జిల్లా న్యాయస్థానాల సముదాయంలో ఈ సమావేశం నిర్వహించారు. రిటైర్డు జిల్లా న్యాయమూర్తులు రాంబాబు, జగన్నాథం, పార్థసారథి చట్టాలపై న్యాయాధికారులతో అవగాహన కల్పించారు. జిల్లా జడ్జి మాట్లాడుతూ పూర్తి అవగాహనతో న్యాయమూర్తులు తీర్పులు ఇవ్వాలన్నారు. సివిల్ కేసుల్లో తీర్పులు, తీర్పుల అమలు, చట్టంలో ఉన్న అంశాలను పూర్తి స్థాయిలో అర్థం చేసుకోవాలని చెప్పారు. డిక్రీల అమలు, నిబంధనలు, నిర్ణయాలకు వ్యతిరేకంగా ఖాళీ స్థలాల స్వాధీనం, అభ్యంతరాల తొలగింపుపై పూర్తిస్థాయిలో పట్టు ఉండాలన్నారు. అప్పుడే తీర్పుల్లో పారదర్శకత సాధ్యమన్నారు. చట్టాల అమలులో ఉన్న సందేహాలను నివృత్తి చేయడానికి వచ్చిన రిసోర్స్ పర్సన్ల నుంచి న్యాయాధికారులు పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా జడ్జి రిసోర్స్ పర్సన్లను సన్మానించి జ్ఞాపికలు అందచేశారు. ఈ సమావేశంలో న్యాయమూర్తులు ఎస్.రమేష్, ఎన్.శాంతి, ఎం.సునిత రాణి, వెన్నెల, గురునాథ్, జి.రాజగోపాల్, రామచంద్రుడు, అర్చన, శ్రీనివాసులు, ఎస్.విష్ణు వర్మ, ఎం.శ్రీనివాస నాయక్, బేబీ రాణి, సికెవి.సత్యకాంత్ కుమార్, జె.కృష్ణ ప్రియతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలువురు న్యాయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి మొక్కల నరికివేత

బైరెడ్డిపల్లె: తన కుటుంబంపై కక్ష సాధించేందుకు మామిడి మొక్కలను నరికివేశారని మండలంలోని తీర్థం గడ్డూరు గ్రామానికి చెందిన నారాయణప్ప శనివారం బైరెడ్డిపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తీర్థం రెవెన్యూ గ్రామ లెక్క దాఖలాల్లో నారాయణప్పకు సుమారు 3 ఎకరాల పొలం ఉంది. అయితే అదే గ్రామానికి చెందిన ఆరెప్ప కుటుంబసభ్యులతో భూవివాదం చోటుచేసుకుంది. దీంతో కోర్టును ఆశ్రయించారు. 3 ఏళ్ల క్రితం పలమనేరు జూనియర్ సివిల్ కోర్టు, మదనపల్లె సబ్‌కలెక్టర్ కోర్టులో నారాయణప్పకు అనుకూలంగా తీర్పు వచ్చింది. దీంతో భూమిని చదును చేసి, 250 మామిడి మొక్కలను సాగు చేశాడు. వ్యవసాయ భూమిలో బోరు లేకున్నా ట్యాంకర్ల ద్వారా మొక్కలకు నీరు అందించాడు. ఇప్పుడు టీడీపీ నేతల అండదండలతో శుక్రవారం రాత్రి ఆరెప్ప కుటుంబసభ్యులు శ్రీనివాసులు, సత్యనారాయణ, మంజుల, తిప్పన్న, రాజేంద్ర దౌర్జన్యంగా కత్తులతో మామిడి మొక్కలను నరికేశారు. పొలం వద్దే ఉన్న నారాయణప్పపై దాడి చేయడంతో గ్రామంలోకి పరుగులు తీసినట్లు బాధితుడు వాపోయాడు. తమకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఇసుక డంప్ పరిశీలన



ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం పాలూరు, ముత్తుకూరు ప్రాంతాల్లో ఇసుక ఉచితంగా తరలింపునకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్డీఓ చిన్నయ్య శనివారం ఇసుక డంప్ ప్రాంతాలను పరిశీలించారు. ఉచిత ఇసుక తరలింపు విధి విధానాలను సచివాలయ సిబ్బందికి వివరించారు. డంప్‌ల్లో సచివాలయ ఉద్యోగులకు డ్యూటీలు వేశారు. కార్యక్రమంలో మైనింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సంక్రమిత వ్యాధుల కట్టడికి టీకాలు

చిత్తూరు అగ్రికల్చర్: జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక దర్గా సర్కిల్ వద్ద ఉన్న పశువైద్యశాల ఆవరణలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జంతువులతో మానవుని అనుబంధం ఎంతో ప్రాచీనమైందన్నారు. మనుషులు, పశువుల సహచర్యంతో జూనోసిస్ వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు సంక్రమించే 280 వ్యాధులను గుర్తించినట్లు వెల్లడించారు. ఈ వ్యాధులు సంక్రమించకుండా ముందస్తుగా జిల్లాకు 18,500 డోసుల ఏఆర్‌వీల వ్యాక్సిన్ సరఫరా చేసినట్లు తెలిపారు. ఈ వ్యాక్సిన్‌లు జిల్లా వ్యాప్తంగా అన్ని పశువైద్య కేంద్రాలు, రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచి, ఉచితంగా కుక్కలకు వేయనున్నట్లు వివరించారు. చిత్తూరు నగర పరిధిలో కుక్కల ద్వారా ప్రజలకు ఎటువంటి హాని జరగకూడదన్న ఉద్దేశంతో ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తెలిపారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 1,500 కుక్కలకు వ్యాక్సిన్ ఇచ్చే కార్యక్రమం చేపడుతున్నారని చెప్పారు. పిచ్చి కుక్క కాటుకు గురైన బాలునికి వ్యాధి రాకుండా శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ 1885 జూలై 6న టీకా మందును కనుగొన్నట్లు పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా కుక్కలకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు.

టీడీపీ దాడులకు భయపడేది లేదు

- పోలీసుల మౌనంపై కమిషన్‌కు ఫిర్యాదు
- చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప



మాట్లాడుతున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు: అధికార తెలుగుదేశం పార్టీ ఇష్టానుసారంగా వైఎస్సార్‌సీపీ నాయకులపైన, కార్యకర్తలపైన దాడులు చేయడం, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని చిత్తూరు మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప హెచ్చరించారు. ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆగడాలు తీవ్రమయ్యాయని చెప్పారు. ఇళ్లపై దాడులు చేసి, ఆడ, మగ, పిల్లలను సైతం భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఇది మంచిపద్ధతి కాదన్నారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. అధికారం వచ్చిందని దౌర్జన్యాలు, దోపిడీ చేస్తే ప్రజలు సహించరని, చరిత్ర తిరగబడుతుందనేది గుర్తుంచుకోవాలని చెప్పారు. దాడులతో ఏం సాధిస్తారో చెప్పాలని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలను తిరగనివ్వమంటూ అడ్డుకోవడం, హౌస్ అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అంటూ అభివర్ణించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వేలకోట్ల రూపాయలతో ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధిని పరిశీలించాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని పార్టీల వారికి సంక్షేమ పథకాలు అందించామన్నారు. కానీ కూటమి ప్రభుత్వం తొలి నెలలోనే వైఎస్సార్‌సీపీ అభిమానులంటూ వృద్ధులు, వితంతువుల పెన్షన్‌ను ఆపివేయడం సమంజసమా అంటూ ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇలా కక్షసాధింపులతో ఎప్పుడైనా సామాన్య ప్రజలను ఇబ్బంది పెట్టామా చెప్పాలంటూ నిలదీశారు. టీడీపీ చేస్తున్న దాడులు, ఆస్తుల విధ్వంసంపై పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడంతో మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసి, హైకోర్టులో పోలీసులపై కేసులు దాఖలు చేస్తామని రెడ్డెప్ప తెలిపారు.

వేర్వేరు చోట్ల చైన్ స్నాచింగ్

చిత్తూరు అర్బన్: రెండు వేర్వేరు చోట్ల మహిళల వద్ద నుంచి చైన్ లాక్కెళ్లిన సంఘటనలు శనివారం వెలుగుచూశాయి. చిత్తూరు నగరం బీవీ.రెడ్డి కాలనీలో కాపురముంటున్న శ్రీదేవి (58) శుక్రవారం రాత్రి షర్మన్ పాఠశాల నుంచి ఇంటికి బయల్దేరారు. ఈ క్రమంలో బైకుపై వెనుక నుంచి వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఈమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కెళ్లారు. 25 గ్రాముల బరువు ఉండే గొలుసు లాక్కెళ్లినట్లు శనివారం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హెల్మెట్లు ధరించి..

పుంగనూరు: పట్టణంలోని సూర్యనగర్‌లో నివాసం ఉన్న హేమ మెడలో బంగారు తాళిబొట్టు చైను లాకెళ్లారు. ఆమె సూర్యనగర్‌లో శనివారం నడుచుకుని వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఇద్దరు హెల్మెట్లు ధరించి ద్విచక్రవాహనంపై వచ్చి మెడలో చైను లాకెళ్లారు. ఆమె కేకలు వేసే లోపు దొంగలు పరారయ్యారు. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సుబ్బారెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ కోతలు తగ్గించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ కోతలు తగ్గించాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు ఈఈలను ఆదేశించారు. ఆయన శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. ఫీడర్ల వారీగా విద్యుత్ అంతరాయాలను తగ్గించడానికి ప్రణాళిక రూపొందించుకోవాలని చెప్పారు. సబ్‌స్టేషన్ నిర్వహణపై సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. తద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలు అందుతాయని వివరించారు. పెండింగ్‌లోని వర్క్ ఆర్డర్లను నెలలోపు పూర్తి చేయాలని సూచించారు. నెలాఖరులోపు విద్యుత్ బిల్లుల కలెక్షన్ వందశాతం వసూలు చేయడానికి కృషి చేయాలని ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతును సకాలంలో చేయాలని పేర్కొన్నారు. జిల్లాకు వర్షాలు పడే సూచన ఉండటంతో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, లైన్‌లాస్ ఏర్పడితే సకాలంలో బాగుచేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఈఈ మునిచంద్ర, డీఈలు పద్మనాభపిళ్లై, శేషాద్రి, జ్ఞానేశ్వర్, జేఏఓ గోవిందరాజులు, ఏఈలు, సబ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.